క్లుప్తంగా

విద్యార్థికి సత్కారం



త్రినాథ్ పండిని సత్కరిస్తున్న ఎంఈవో తిరుమలరావు తదితరులు

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్న రామరాజు చారిటబుల్ ట్రస్ట్ కృషి అభినందనీయమని ఎంఈఓ–2 సీహెచ్ తిరుమలరావు అన్నారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి త్రినాథ్ పండి శుక్రవారం సత్కరించారు. నగదుతో పాటు జ్ఞాపిక, పురస్కారం అందించి అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.వైకుంఠరావు మాట్లాడుతూ.. ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పి.రామరాజు, ఉపాధ్యాయులు తారక రామారావు, కోటి, మనీషా, అప్పారావు పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న ఈశ్వరరావు

నరసన్నపేట: రాష్ట్ర ఫారెస్టు కార్పొరేషన్ డైరెక్టర్‌గా రెండేళ్లుగా వ్యవహరిస్తున్న బొబ్బాది ఈశ్వరరావు శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని సంబంధిత ఎండీకి పంపించినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనకు ఈ పదవి వచ్చే విధంగా కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



కుమ్మరిగుంటలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సారవకోట: చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ కుమ్మరిగుంట, అలుదు గ్రామాల్లో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, ప్రీస్కూల్ విధానాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తల్లిదండ్రులకు తెలియజేశారు. పిల్లలకు అందిస్తున్న పోష్టికాహారం గురించి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మోడల్ మరుగుదొడ్డి!



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

సరుబుజ్జిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం నిర్మించిన మోడల్ మరుగుదొడ్డి పనిచేయడం లేదు. మండలంలోని అన్ని పంచాయతీలు ఆదర్శంగా తీసుకొని మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలకు కృషిచేసే దిశగా మండల కేంద్రంలో మోడల్ మరుగుదొడ్డిని అధికారులు నిర్మించారు.అయితే వీటినిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. మరుగుదొడ్డికి తలుపుకూడా లేదు. బేసిన్ పాడైంది. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని కార్యాలయానికి వచ్చేవారు కోరుతున్నారు.

కొత్తూరులో రైతు బజారు ఏర్పాటు చేయాలి

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో రైతు బజారు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు కోరారు. కొత్తూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. భామిని, సీతంపేట, కొత్తూరు మండలాల్లో పండించిన కూరగాయలను రైతులు విక్రయించేందుకు కొత్తూరు మార్కెట్‌కు తీసుకొస్తారన్నారు. మూడు మండలాలకు ప్రధాన కేంద్రమైనప్పటికీ కూరగాయాలను విక్రయించేందుకు స్థలం లేక పోవడంతో ప్రధాన రోడ్డు పక్కనే ఉంచుతున్నారన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడటంతో పాటు వాహనాల రాకపోకలకు సమస్యగా మారిందన్నారు. రైతు బజార్ ఉంటే రైతులకు ఈ సమస్య ఉండదని చెప్పారు. అధికారులు ఆ దిశగా ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వరి విత్తనాలు పంపిణీ

కొత్తూరు: కొత్తూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద శనివారం వరి విత్తనాలను పంపిణీ చేయనున్నారు. దీని కోసం వ్యవసాయశాఖ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కాగా పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవింద్ విత్తనాల పంపిణీని ప్రారంభిస్తారని కొత్తూరు మండల వ్యవసాయాధికారులు చెప్పారు. ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే విత్తనాలను అందజేస్తారు.

కూరగాయల ధరలకు రెక్కలు!



కూరగాయలు

- ఆందోళనలో జనం

సరుబుజ్జిలి: కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు తగ్గడం, రవాణా చార్జీలు పెరగడం ధరలు పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అయితే పంటలు పండిస్తున్న రైతులకు ఏమాత్రం గిట్టుబాటు ధర లభించడంలేదంటున్నారు. ఆమాంతంగా పెరిగిన ధరలతో సామాన్యుడు కూరగాయలు కొనుక్కొని తినడానికి భయపడుతున్నాడు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు కూరగాయల సాగు అధికంగా చేస్తుంటారు. దీంతో ఇక్కడ పండే కూరగాయలు ఒప్పందాల మేరకు రైతులు మార్కెట్‌లో ఉండే షాపులకు సరఫరా చేస్తారు. అయితే మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటుధరలు రాకుండా చేస్తున్నారు. రైతులకు సరైన ధరలు చెల్లించని నమ్మబలికి దళారీలు వినియోగదారునిపై అధిక ధరలు మోతపెడుతున్నారు. రైతుల నుం తక్కువధరకు కొనుగోలు చేసే దళారీలు మళ్లీ గ్రామస్థాయికి తెచ్చి అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. అమాంతంగా పెరిగిన ధరలతో సామాన్యులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ధరల పెరుగుదలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో)			
వంకాయలు	రూ. 45	చిక్కుడు	రూ. 40
టమాటా	రూ. 70	మిర్చి	రూ. 80
బెండకాయలు	రూ. 50	దొండకాయలు	రూ. 40
బీరకాయలు	రూ. 50	బీన్స్	రూ. 85
బంగాళ దుంపలు	రూ. 40	వెల్లుల్లి	రూ. 200
ఉల్లి	రూ. 40	క్యారెట్	రూ. 60

ఇబ్బందులు తప్పడంలేదు



అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో ఇబ్బంది పడుతున్నారు. భారీగా పెరిగిన ధరలతో ఇబ్బందులు తప్పడంలేదు. కూరగాయలకు బదులు ఆకుకూరలతో సర్దుకుపోతున్నాం.

–ఎస్.రాజేశ్వరి, గృహిణి, సరుబుజ్జిలి

దడపుట్టిస్తున్న ధరలు



కూరగాయల ధరలు దడపుట్టిస్తున్నాయి. దళారుల కారణంగానే ధరలు పెరుగుతున్నాయి. రైతులకు ఏమాత్రం కలిసి రావడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న టమాటా ధర ఆందోళన కలిగిస్తుంది.

–జి.లక్ష్మి, గృహిణి, సరుబుజ్జిలి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో వైద్య సిబ్బంది

జలుమూరు: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైరిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.గురునాథరావు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సైరిగాం గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. దోమలు నివారణ కోసం మిత్రిన్ పిచికారీ చేయాలన్నారు. తరచూ జ్వరం, తలనొప్పి, కాళ్లపీకులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఆరోగ్యవిస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు, సబ్ యూనిట్ అధికారి వై.శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన రమణ మూర్తి, ముసలినాయుడు, పీహెచ్‌ఎన్ లలితకుమారి, పర్యవేక్షకులు సరోజిని, ఆరోగ్యకార్యకర్త మెట్ట రంగమ్మ ఉన్నారు.

'రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి'



మాట్లాడుతున్న నూకరాజు

ఆమదాలవలస: కాళింగ సామాజిక వర్గానికి చెందిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు కోరారు. ఆమదాలవలస పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లా పార్టీ పగ్గాలు చేపట్టి 19 కేసుల్లో ఇరుక్కున్నారన్నారు.

తాజాగా జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పది సీట్లను గెలిపించి క్లీన్ స్వీప్ చేసిన ఘనత రవికుమార్‌కే దక్కుతుందని అన్నారు. అయితే పార్టీ అధిష్టానవర్గం కాళింగులకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించలేదన్నారు. గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించే వారన్నారు. ఈసారి ఎందుకు విస్మరించారో అర్థం కావడం లేదని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజల మనోభావాలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా అన్నివిధాల అర్హత కలిగిన రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతిరావు మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్ర మంత్రిగా, రాష్ట్రంలో అచ్చెన్నాయుడుకు మంత్రి పదవులు కేటాయించడం సంతోషకరమన్నారు. అయితే ప్రజా నాయకుడు రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. 2009 ఎన్నికల సమయంలో టీడీపీని విడిచి తమ్మినేని సీతారాం వెళ్లిపోయిన సమయంలో పార్టీ తరపున పోటీ చేయాలని.. నీ మేనమామ కంటే మంచి ఉన్నత స్థానానికి తీసుకువెళ్తానని ఇచ్చిన హామీని ఇప్పుడు చంద్రబాబు విస్మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. టీడీపీ అంటే తమకు గౌరవం ఉందని.. అదే సమయంలో పార్టీ తీసుకున్న నిర్ణయంపై నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయాన్ని చంద్రబాబు గమనించాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించిందన్నారు. అలాగే కాళింగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి స్పీకర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ వంటి పదవులను ఇచ్చి గౌరవించిందన్నారు. కానీ టీడీపీ కాళింగులకు మొండి చేయి చూపడం విస్మయానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశంలో టీడీపీ నాయకులు అన్నెపు భాస్కరరావు, కె.వి.రమణ, నేతింటి జ్యోతి, ఎండ అప్పలనాయుడు, సనపల చెల్లం నాయుడు, గుజ్జల లక్ష్మణరావు, వండాన ఉదయ్‌కుమార్, బత్తుల బుజ్జి, తమ్మినేని అమర్నాథ్, బుడుమూరు శ్రీనివాసరావు ఉన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: నియోజవర్గంలోని రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తనను కలవడానికి వచ్చిన వ్యవసాయాధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలన్నారు. అలాగే గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో రామకృష్ణరాజుకు సూచించారు. కార్యక్రమంలో ఏడీ ఎల్.వి.మధుబాబు, ఏఓ రవికుమార్, ఏఈఓలు భారతి, శారద, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సకాలంలో స్టూడెంట్ కిట్లు పంపిణీ



ఆటోల్లో తరలిస్తున్న స్టూడెంట్ కిట్లను పరిశీలిస్తున్న విజయకుమారి

పొందూరు: విద్యార్థులకు సకాలంలో స్టూడెంట్ కిట్లను అందజేయాలని డిప్యూటీ ఈవో ఆర్.విజయకుమారి హెచ్‌ఎంలకు సూచించారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టూడెంట్ కిట్ల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం పరిశీలించారు. పాఠ్య, నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రిని త్వరగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలకు సూచించారు. ఎంఈవో పట్నాన రాజారావు, హెచ్‌ఎం పి.వెంకటరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి మణి

ఆమదాలవలస: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాలిడ్ వేస్ట్ మెటీరియల్‌పై అవగాహన, న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, కింతలి త్రినాథరావు, పి.వి.నరసింహులు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటనపై హర్షం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

హిరమండలం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేసినందుకు నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక న్యూ బ్యారేజీ సెంటర్ వద్ద జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు మెగా డీఎస్సీని ప్రకటించారంటూ కృతజ్ఞత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జానకీరామ్, కొర్రాయి రాము, సూర జగదీశ్వరరావు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనం



అవగాహన కల్పిస్తున్న డీపీఎం ధనుంజయరావు తదితరులు

హిరమండలం: నవధాన్యాల సాగుతో ఎంతో ప్రయోజనకరమని అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద నవధాన్యాల తయారీపై అవవగాహన కల్పించారు. నవధాన్యాల సాగువల్ల కలిగే ప్రయోజనాలను ఎంటీ సూర్యనారాయణ వివరించారు. ఇవి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయని చెప్పారు.

కార్యక్రమంలోఎస్ఎఫ్ఏ ముసలయ్య, ఎంటీ సూర్యనారాయణ,సీసీ సుజాత,రాములమ్మ, లత పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని కల్యాణ పీఠం అలంకరణ



కల్యాణ పీఠాన్ని సిద్ధం చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలలో భాగంగా సోమవారం జరగనున్న పార్వతి పరమేశ్వరుల కల్యాణం కోసం అర్చకులు పీఠాన్ని సిద్ధం చేస్తున్నారు. అమ్మవారు, స్వామివారి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏటా నూతన పీటతోపాటు వాటికి ప్రత్యేక అలంకరణ, రంగులు దిద్ది సిద్ధం చేస్తున్నారు.

పాఠశాల ఆవరణ జలమయం



పాఠశాల ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

పొందూరు: పొందూరులో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో కాలువల్లో నీరు పొంగి పొర్లి రోడ్లపైకి వచ్చింది. పట్టణంలోని ఒకటో నంబర్ పాఠశాల ప్రాంగణంలోకి వర్షం నీరు చొరబడింది. దీంతో బురదమయంగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు.

పూర్తిస్థాయిలో పుస్తకాలు అందించాలి



పుస్తకాల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించాలని ఎంఈవో రాంబాబు సిబ్బందికి సూచించారు. ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే తెలియజేయాలన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాల తరలింపును శుక్రవారం పర్యవేక్షించారు. స్టూడెంట్ కిట్లను సక్రమంగా అందించాలన్నారు. ఎక్కడా లోపాలు వెలుగు చూడకుండా చూసుకోవాలన్నారు. సీఆర్పీలు, స్కూల్ హెచ్‌ఎంలు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



మంటలను అదుపుచేస్తూ..

శ్రీకాకుళం క్రైమ్: అగ్నిప్రమాదాలపై అవగాహన ఉంటే సులువుగా అరికట్టవచ్చని శ్రీకాకుళం అగ్నిమాపక సహాయ అధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు, ఉద్యోగులు, సిబ్బందికి శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినపుడు ఆస్పత్రిలో అమర్చిన పరికరాల ద్వారా ఎలా అరికట్టవచ్చో ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ పార్వతి, ఆర్ఎంఓ సుభాషిణి, భాను ప్రకాష్, అగ్నిమాపక సిబ్బంది బి.ఎస్.నాయుడు, రామస్వామి, కోటేశ్వరరావు, కూర్మారావు పాల్గొన్నారు.

తొగరాం డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఆమదాలవలస: తొగరాం గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యనారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ గ్రూపులో మ్యాథ్స్, బోటనీ, జువాలజీ, బీఏలో పొలిటికల్ సైన్స్, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్ మేజర్ సబ్జెక్టులుగాను, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్, ఫిజిక్స్ మైనర్ సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపక సిబ్బంది ఉన్నారన్నారు.

ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాల పని వేళల్లో నేరుగా గాని లేదా 94405 26302, 83099 77349, 93984 19249 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఫ్రీజోన్‌గా అమ్మవారి ఆలయ ఆవరణ

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయ ఆవరణ పరిసరాల్లో ఎటువంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు లేకుండా ఫ్రీజోన్‌గా ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆలయ ఈవో టి.వాసుదేవరావుకు సూచించారు. అమ్మవారిని ఎమ్మెల్యే శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో ఎటువంటి ఫ్లెక్సీలు, బానర్లు, కరపత్రాలు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. నాయకుడు నెయ్యిల రామారావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

● చేప దొరికింది..



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ సరైన వర్షాల్లేవు. వ్యవసాయ పనులు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. దీనికితోడు ఎండలు మండుతుండడంతో చెరువులు అడుగంటుతున్నాయి. దీంతో చేపల వేట కోసం జనం ఆసక్తి చూపుతున్నారు. లావేరు మండలంలోని ఆరంగిపేట–మురపాక మధ్య కొద్దిపాటి నీటితో ఉన్న చెరువులోకి స్థానికులు శుక్రవారం మధ్యాహ్నం చేపల కోసం పోటాపోటీగా దిగారు. వలలు, ఇతర సామగ్రితో చేపలను పట్టి సందడి చేశారు.

–ఎచ్చెర్ల